## క్లుప్తంగా

### రాయచోటి రూరల్ సీఐగా తులసీరాం



రాయచోటి టౌన్ : రాయచోటి రూరల్ సీఐగా తులసీరాం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఇక్కడ సీఐకు పనిచేస్తున్న సీఐ లింగప్ప బదిలీపై కుప్పం రూరల్ పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు. తులసీరాం గతంలో ఎస్‌ఐగా రాయచోటి అర్బన్ పోలీస్ స్టేషన్‌లో పని చేశారు. కాగా బదిలీపై వెళ్తున్న లింగప్పను ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు, మైనార్టీ నాయకుడు బేపారీ మహ్మద్‌ఖాన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాయచోటి ప్రాంతానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు.

### జ్వర పీడితులను గుర్తించండి

సిద్దవటం : వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి సర్వే చేసి జ్వర పీడితులను గుర్తించి, నిర్ధారించుకొని చికిత్స అందించాలని అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాదర్‌వలి తెలిపారు. మండలంలోని భాకరాపేటలోని విలేజ్ హెల్త్ క్లినిక్‌ను సోమవారం ఆయన తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం అక్కడ జరుగుతున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంపై వాకబు చేశారు. సోమవారం జరిగిన మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమంలో క్రమంగా జరిగే వ్యాధి నిరోధక టీకాలను వేయించుకోని 0 – 5 సంవత్సరాల లోపు పిల్లల్ని గుర్తించి వారికి అవసరమైన టీకాలను వేయించాలని ఏఎన్‌ఎంలకు సూచించారు. మాధవరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శివకుమార్, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్‌లు పాల్గొన్నారు.

### అంగన్‌వాడీ సెంటర్‌ల తనిఖీ



అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీ చేస్తున్న దృశ్యం

రాజంపేట రూరల్ : మండల పరిధిలోని రాంనగర్, పోలి(ఎస్టీ కాలనీ)లో ఉన్న అంగన్‌వాడీ సెంటర్లను విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం కింద ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారం మెనూ ప్రకారం అందజేస్తున్నారా లేదా అని ఆరా తీశారు. చంటి పిల్లలు, గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న గుడ్లు, పాలు, బియ్యం, కందిపప్పు, వంటనూనె, చిక్కి, బాలమృతం, రాగిపిండి, బెల్లం వంటి వాటి సరఫరా ఏ విధంగా జరిగిందో రికార్డులను పరిశీలించారు.

### పిల్లలకు వ్యాక్సిన్ తప్పనిసరి

లక్కిరెడ్డిపల్లె : ఐదు సంవత్సరాలు నిండిన ప్రతి బిడ్డకు వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించాలని ఎంఎల్‌హెచ్‌పీ చంద్రశేఖర్ పేర్కొన్నారు. వైఎస్సార్ విలేజ్ క్యాంపస్ దప్పేపల్లె గ్రామంలో ప్రాథమిక పాఠశాల పిల్లలకు వ్యాక్సిన్ వేయించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే అంగన్‌వాడీ కేంద్రంలో పేరు నమోదు చేసుకోవాలని, ప్రతినెల బిడ్డ ఎదుగుదల గురించి పరీక్షలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శంకరయ్య, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

### అల్లర్లను అదుపు చేయడంలో కేంద్రం విఫలం



నిరసన ప్రదర్శన చేస్తున్న క్రైస్తవులు

రాయచోటి అర్బన్ : మణిపూర్ రాష్ట్రంలో చోటుచేసుకున్న హింసాత్మక సంఘటనలను నిరసిస్తూ సోమవారం రాయచోటి పట్టణంలో సెయింట్ పాల్స్ లూథరన్ చర్చి ఆధ్వర్యంలో శాంతి ర్యాలీని నిర్వహించారు. పట్టణంలోని సంజీవనగర్ కాలనీ నుంచి తహశిల్దార్ కార్యాలయం వరకు సంఘ పెద్దలు, ఫాదర్స్, ప్రజలు ర్యాలీలో పాల్గొన్నారు. సేవ్ మణిపూర్ అంటూ నినాదాలు చేస్తూ నిరసన ప్రదర్శన చేశారు. మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులను అరికట్టాలన్నారు. 3 నెలలుగా మణిపూర్‌లో జరుగుతున్న అల్లర్లను అదుపు చేయడంలో కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు.

### బీపీ మండల్‌కు నివాళి

రాయచోటి అర్బన్ : బీసీ రిజర్వేషన్‌ల ప్రదాత బి.పి.మండల్‌కు సోమవారం బీసీ నేతలు ఘనంగా నివాళులర్పించారు. స్థానిక అంబేడ్కర్ చిత్రపటం వద్ద వారు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ప్రజాగాయకుడు గద్దర్ మృతికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా బీసీ చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు బి.సి.రమణ, జిల్లా ఉపాధ్యక్షుడు ప్రసాద్, ఏపీ వడ్డెర మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు జీవానందం, రజక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, నేతలు పూజారి వెంకటసుబ్బయ్య, జడపాల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

### వీరభద్రుడికి పల్లకీ సేవ

రాయచోటి టౌన్ : రాయచోటి భద్రకాళి సమేత వీరభద్రస్వామి పల్లకీలో ఊరేగారు. సోమవారం రాత్రి స్వామివారు, అమ్మవారి ఉత్సవమూర్తులను పల్లకీలో ఉంచి ఆలయ మాడ వీధులలో ఊరేగించారు. కార్యక్రమంలో భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ



రాజంపేట టౌన్ : మండలంలో ఒక సర్పంచ్, రెండు వార్డు మెంబర్ స్థానాలకు ఈనెల 19న జరుగనున్న ఎన్నికలకు మంగళవారం నుంచి నామినేషన్లు స్వీకరించనున్నట్లు ఎంపీడీఓ ఫణిరాజకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆకేపాడు సర్పంచ్ ఆకేపాటి చిన్నమ్మ, గుండ్లూరు పంచాయతీలోని మూడవ వార్డు మెంబర్ ఇండ్లూరి సుబ్బమ్మ, ఎంజీపురం పంచాయతీలోని ఏడవ వార్డు మెంబర్ పోలుబోయిన పెంచలయ్య అకస్మికంగా మృతి చెందడంతో పైస్థానాలకు ఎన్నిక అనివార్యమైందన్నారు. అందువల్ల రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు ఖాళీల స్థానాలకు ఎన్నికలను నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. ఆకేపాడు సర్పంచ్ స్థానం ఓసీ జనరల్, గుండ్లూరు మూడవ వారు మెంబర్ స్థానాన్ని బీసీ మహిళ, ఎంజీపురం ఏడవ వార్డు మెంబర్ స్థానాన్ని ఓసీ జనరల్‌కు కేటాయించినట్లు తెలిపారు. నామినేషన్లను ఈనెల 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకు ఎంపీడీఓ కార్యాలయంలో స్వీకరించనున్నట్లు తెలిపారు. అలాగే 11వ తేదీ నామినేషన్ల పరిశీలన, నామినేషన్లను ఉపసంహరణకు 14వ తేదీ సాయంత్రం 3 గంటల వరకు గడువు ఉంటుందన్నారు. పై స్థానాలు ఏకగ్రీవం కాకుంటే 19వ తేదీ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఆయా పంచాయతీ కేంద్రాల్లో ఎన్నిక జరుగుతుందన్నారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఓట్ల లెక్కింపు, అనంతరం ఫలితాల ప్రకటన ఉంటుందని ఎంపీడీఓ తెలిపారు.

**సిద్దవటంలో..**

సిద్దవటం : మండలంలోని నాలుగు గ్రామాల్లో ఖాళీగా ఉన్న గ్రామ, వార్డు సభ్యుల ఎన్నికకు ఈనెల 8వ తేదీ నుంచి నామినేషన్‌లను స్వీకరించనున్నట్లు ఎంపీడీఓ జవహర్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని కడపాయపల్లె గ్రామ పంచాయతీలో 3వ వార్డు, ఉప్పరపల్లె పంచాయతీలో 10వ వార్డు, మూలపల్లె పంచాయతీలో 3వ వార్డు, మాధవరం –1 పంచాయతీలో 2 వార్డులకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉందన్నారు. ఆయా ఖాళీలను భర్తీ చేసేందుకు ఈనెల 8 నుంచి ఆయా పంచాయతీ కార్యాలయాల్లో నామినేషన్‌లను స్వీకరిస్తామని ఆయన అన్నారు.

## భూమనను కలిసిన ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్



భూమనకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే మేడా



భూమనను సత్కరిస్తున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి

రాజంపేట రూరల్ : తిరుమల తిరుపతి దేవస్థానం నూతన చైర్మన్‌గా రెండవ పర్యాయం ఎన్నికైన తిరుపతి శాసనసభ్యులు భూమన కరుణాకర్‌రెడ్డికి ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. తిరుపతిలోని టీటీడీ చైర్మన్ భూమన స్వగృహంలో సోమవారం ఆయనను ఎమ్మెల్యే మేడా దుశ్శాలువాతో సన్మానించారు. ఎమ్మెల్యే వెంట సుండుపల్లె వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రామస్వామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పి.మల్లికార్జునరెడ్డి, రెహమాన్‌ఖాన్ తదితరులు ఉన్నారు.

**శుభాకంక్షలు తెలిపిన జెడ్పీ చైర్మన్**

తిరుమల తిరుపతి దేవస్థానం నూతన చైర్మన్‌గా రెండవ పర్యాయం ఎన్నికైన తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డిని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి, చొప్పా ఎల్లారెడ్డిలు ఆయన స్వగృహంలో సోమవారం కలిశారు. భూమనకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నమయ్య జన్మస్థలమైన తాళ్లపాక గ్రామానికి పూర్వవైభవం తీసుకురావాలని కోరామన్నారు. వారి వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ మర్రి రవికుమార్ తదితరులు ఉన్నారు.

పుల్లంపేట : తిరుమల-తిరుపతి దేవస్థానం చైర్మన్‌గా ఎంపికై న భూమన కరుణాకర్ రెడ్డిని సోమవారం తిరుపతిలోని ఆయన నివాసం వద్ద పుల్లంపేట ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బాబుల్ రెడ్డి కరుణాకర్‌రెడ్డిని సన్మానించారు. గోపాల్ రెడ్డి, రంగారెడ్డి, సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించండి

రాయచోటి అర్బన్ : రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వసతి గృహాలు, గురుకులాలు, కేజీబీవీల విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని పట్టణంలోని జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయం ఎదుట సోమవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థులు ఆందోళన నిర్వహించారు. పీడీఎస్‌యూ రాష్ట్రసహాయ కార్యదర్శి అంకన్న మాట్లాడుతూ వసతి గృహ సంక్షేమాధికారులు మండల కేంద్రాల్లో కాకుండా నియోజకవర్గ కేంద్రాల్లో నివాసం ఉంటూ తూతూమంత్రంగా విధి నిర్వహణ చేస్తుండడం దారుణమన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్‌చార్జీలు, కాస్మటిక్ చార్జీలను పెంచాలన్నారు. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలంటూ డిమాండ్ చేశారు. వసతి గృహాలను అద్దె భవనాల నుంచి స్వంత భవనాలకు తరలించాలంటూ కోరారు. అనంతరం ఈ మేరకు జిల్లా ఎస్సీ, సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయం సూపరింటెండెంట్ శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నేతలు మధు, గౌతమ్, భాను, యూనస్, రెడ్డిశేఖర్, చందు, పునీత్, సోహిద్ పాల్గొన్నారు.

## ప్రజాగాయకుడు గద్దర్‌కు నివాళి



గద్దర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

చిట్వేలి : ప్రముఖ విప్లవ గాయకుడు గద్దర్ మృతి వామపక్ష ఉద్యమానికి తీరని లోటని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పందికాళ్ల మణి, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ ప్రాజెక్టు కన్వీనర్ సుజాతలు పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎంఈఓ కార్యాలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో గద్దర్ మృతి పట్ల సంతాపాన్ని తెలియజేయడంతోపాటు ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ వామపక్ష ఉద్యమానికి గద్దర్ చేసిన సేవలను మననం చేసుకున్నారు. కార్యక్రమంలో గ్రామ సేవకుల సంఘం మండల అధ్యక్షుడు కొరముట్ల, సుధాకర్, దివ్యాంగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆంధ్రయ్య, మండల కమిటీ సభ్యులు నందు, మాలమహానాడు మండల అధ్యక్షుడు జె.వెంకటసుబ్బయ్య, సుబ్బరాయుడు, ఈశ్వరయ్య, గ్రామ సేవకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆశ కార్యకర్తల గౌరవవేతనం పెంచాలి



ధర్నా చేస్తున్న ఆశ కార్యకర్తలు

రాయచోటి అర్బన్ : ఆశ వర్కర్లకు గౌరవవేతనం రూ.15 వేలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ఇన్‌చార్జ్ గంగాధర్‌లు డిమాండ్ చేశారు. తమ డిమాండ్‌ల సాధన కోసం ఆశ వర్కర్లు సోమవారం డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ సెలవులు, సంక్షేమ పథకాలను వర్తింపజేయాలన్నారు. గర్భిణులు, బాలింతలు, పసిపిల్లలకు వైద్యసేవలు అందిస్తున్న ఆశ కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. మెడికల్ ఆఫీసర్లు ఆశాలను పలురకాలుగా వేధింపులకు గురిచేయడం వెంటనే మానుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా గౌరవఅధ్యక్షుడు సిద్దిగాళ్ల శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి, పట్టణ కార్యదర్శి పుల్లయ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎప్పటికీ ఎమ్మెల్యే మేడా వెంటే ఉంటాం

- పార్టీ మారుతున్నామనేది దుష్ప్రచార
- వైఎస్సార్‌సీపీ నాయకుడు సంజీవరెడ్డి



మాట్లాడుతున్న మల్లు సంజీవరెడ్డి

సిద్దవటం : తాము టీడీపీలో చేరుతున్నామని కొంత మంది పనిగట్టుకుని దుష్ప్రచారం చేయడం తగదని మాచుపల్లె వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లు సంజీవరెడ్డి, బాలిరెడ్డిలు మండిపడ్డారు. సిద్దవటం మండలంలోని మాచుపల్లె గ్రామంలో సోమవారం సంజీవరెడ్డి గృహంలో వారు విలేకరులతో మాట్లాడుతూ రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి సోదరుడు మేడా విజయశేఖర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా మా ఇంటికి వచ్చి కలిశారన్నారు. అయితే ఎమ్మెల్యే సోదరుడిగా ఆయనకు గౌరవ మర్యాదలు చేశామే గాని, మేము వైఎస్‌ఆర్‌సీపీ పార్టీని వీడి టీడీపీలో చేరుతున్నామని చెప్పలేదన్నారు. మేము మా కార్యకర్తలం ఎప్పటికీ ఎమ్మెల్యే వెంటే ఉంటామన్నారు. ఎవరు ఎన్ని అసత్య ప్రచారాలు చేసినా నమ్మవద్దని వారు తెలిపారు. కార్యక్రమంలో మాచుపల్లె సర్పంచ్ మల్లు విజయభాస్కర్‌రెడ్డి, సింగిల్ విండో మాజీ డైరెక్టర్ మల్లు పెద్ద వెంకటసుబ్బారెడ్డి, బూత్ కమిటీ కన్వీనర్ కృష్ణారెడ్డి, నాగార్జునరెడ్డి, జగన్‌మోహన్ రెడ్డి, రఘునాథరెడ్డి, ఎరికల్‌రెడ్డి, కె.శ్రీనివాసులరెడ్డి, సోమిరెడ్డి, జి.ఎస్. శ్రీనివాసులరెడ్డి, శిల్పిరెడ్డి, రమణారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 21లోపు ఓటర్ల సర్వేను పూర్తి చేయండి

పెనగలూరు : ఈనెల 21వ తేదీలోపు ఓటర్ల ఇంటింటి సర్వేను పూర్తి చేయాలని తహసీల్దార్ శ్రీధర్ రావు అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఓలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితా సర్వే గడువు దగ్గరకు వస్తోందని, ప్రతిరోజూ సర్వే జాబితాను తమకు తెలియజేయాలన్నారు. మండలంలో వందశాతం 21వ తేదీలోపు పూర్తిచేసి ఉన్నతాధికారులకు నివేదికలు అందించాలన్నారు. అనంతరం పలు అంశాలపై వారు చర్చించారు.

### అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

సిద్దవటం: ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు ఉంటాయని ఎస్‌ఐ తులసీ నాగప్రసాద్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ మట్కా, నాటుసారా, పేకాట, గంజాయి, సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించామన్నారు. గ్రామాల్లో ఎవరైనా ఎర్రచందనం అక్రమాలకు పాల్పడుతున్నా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని, ద్విచక్రవాహనదారులు ప్రయాణించేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలని తెలియజేశారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని హెచ్చరించారు.

### రైతుల సమస్యలు వెంటనే పరిష్కరించండి

ఓబులవారిపల్లె : మండలంలోని రైతుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి తహసీల్దర్ పుల్లారెడ్డిని కోరారు. సోమవారం స్థానిక తహసీల్దర్ కార్యక్రమంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో సాయికిషోర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని దళితుల భూములకు సంబంధించి ఆన్‌లైన్ సమస్యను వెంటనే పరిష్కరించాలన్నారు. అనంతరం స్థానిక ఎంపీడీఓ కార్యలయంలో నిర్వహించిన పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. గ్రామాల సమస్యలు ఇతర అంశాలపై మాట్లాడారు. మండలంలోని రాళ్లచెరువుపల్లె, బీపీ రాచపల్లె, బోటిమీదపల్లె పంచాయతీలలో నిర్వహించనున్న వార్డు మెంబర్ల ఎన్నికలపై ఎంపీడీఓతో చర్చించారు. మంగళవారం నుంచి నామినేషన్లు స్వీకరిస్తున్నట్లు ఎంపీడీఓ విజయారావు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు టి.కృష్ణారెడ్డి, ఎంపీటీసీ దుర్గప్రసాద్, నరసింహారెడ్డి, మారే సూకుమార్, రైతులు పాల్గొన్నారు.

### రామాలయ నిర్మాణానికి రూ.5 లక్షల విరాళం

ఓబులవారిపల్లె : రామాలయ నిర్మాణానికి ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ వారు రూ. 5 లక్షల విరాళాన్ని అందించారు. చిట్వేలి మండలం కె.బుడుగుంటపల్లె దళితవాడలో నిర్మించే ఆలయానికి ఫౌండేషన్ చేసిన సాయాన్ని సోమవారం సోమవారం ముక్కా రూపానందరెడ్డి ఆయన స్వగృహంలో విరాళాన్ని చెక్కు రూపంలో అందజేశారు. అనంతరం పెద్దసంఖ్యలో పాల్గొన్న గ్రామస్తులు ముక్కా రూపానందరెడ్డి దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ముక్కా వరలక్ష్మి, రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి ముక్కా సాయివికాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ తమ్మెద తిరుపాల్, రామాలయం అధ్యక్షులు దార్ల చంద్రశేఖర్, సీనియర్ నాయకుడు బత్తిన వేణుగోపాల్‌రెడ్డి, సర్పంచ్ అరవ శ్రీధర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

### అర్జీదారులకు అన్నదానం

రాయచోటి టౌన్ : స్పందనకు వచ్చే అర్జీదారులకు నిర్వహించే అన్నదానం సోమవారంతో 31వ వారానికి చేరుకుంది. అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి సహకారంతో అర్జీదారులకు ఉచితంగా భోజనం అందిస్తున్నారు. కార్యక్రమంలో దాతలు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తబ్రేజ్‌ఖాన్, కౌన్సిల్ సభ్యులు గౌస్‌ఖాన్, అల్తాఫ్, కేటీసీ యూసుఫ్, మువాయజ్ అలీఖాన్ తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా చేనేత కార్మికుల దినోత్సవం

వీరబల్లె (రాయచోటి టౌన్) : వీరబల్లె మండల పరిధిలోని మట్లి గ్రామంలో చేనేత కార్మికుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సోమవారం మట్లి గ్రామంలోని సచివాలయంలో జరిగిన వేడుకలో మట్లి సర్పంచ్ నాగార్జునాచారి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేత పరిశ్రమలు, చేనేతలకు వెన్నుదున్నుగా నిలిచి వారి ఆర్థిక ఉన్నతి కోసం ఎంతో కృషి చేస్తోందన్నారు. చేనేతలు మరింత ఉన్నతంగా ఎదిగేందుకు రాష్ట్ర ప్రభుత్వం పావలా వడ్డీకే రుణాలు ఇస్తోందని తెలిపారు. కార్యక్రమంలో మోడం లక్ష్మమయ్య, డి.నాగమణి, వెంకటా చలపతి, పంచాయతీ కార్యదర్శి రామాంజులు తదితరులు పాల్గొన్నారు.

### పకడ్బందీగా పంటల నమోదు

గాలివీడు : పంటల నమోదు ప్రక్రియ పకడ్బందీగా సాగాలని మండల వ్యవసాయ అధికారి మురళీధర్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కొర్లకుంట రైతు భరోసా కేంద్రంలో అగ్రికల్చర్ అసిస్టెంట్లకు పంట కోత ప్రయోగాలపై మండల స్థాయి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. మాట్లాడుతూ ఉచిత పంటల బీమా పథకం అమలు, రైతులకు బీమా పరిహారం చెల్లించడానికి పంటకోత ప్రయోగం కీలకమన్నారు. పంటకోత ప్రయోగాలను ప్రతి ఒక్కరూ సక్రమంగా నిర్వహించి, కచ్చితమైన సమాచారం సేకరించి నమోదు చేయాలన్నారు.

## అందమైన గృహాలు.. పేదలకు ఆవాసాలు

| మండలం | రైల్వేకోడూరు |
|---|---|
| గృహాలు మంజూరైన లబ్ధిదారులు | 2877 |
| లబ్ధి రూ. | 51,78,60,000 |

రైల్వేకోడూరు : దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలోనూ ఎన్నడూ ఎరుగని రీతిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తూ గృహాలు మంజూరు చేశారు. ఇళ్లు లేదనే పేదవారు ఉండకూడదనే ఉద్దేశంతో సంతృప్త స్థాయిలో అర్హులందరికీ ఇళ్ల పట్టాలు ఇచ్చారు. పారదర్శకతతో ఎక్కడా అవినీతికి తావు లేకుండా లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు అందించి ఆ స్థలాల్లో ఇళ్లను నిర్మించేందుకు రూ.1.80లక్షలను సాయం చేశారు. ఇళ్ల స్థలాలను సైతం మహిళల పేరు మీద ఇస్తూ మహిళామణులకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. అది కూడా గ్రామాలు, పట్టణానికి అనుకుని పచ్చని తోటలు, చెట్లతో నిండిన కొండలు, పొలాల పక్కన జగనన్న కాలనీలు ఏర్పాటు చేశారు. జగనన్న కాలనీలలో అన్ని మౌలిక వసతులు కల్పించారు. దీంతో ఇళ్లు లేని పేదల కలను సీఎం జగన్ సాకారం చేశారు.

### ఇంటి కల నేరవేరింది



నా పేరు నిడిగంటి లీలావతి. రైల్వేకోడూరు మండలం రాజీవ్ గిరిజన కాలనీలో నివాసం ఉంటున్నాం. నాకు ఎన్నో సంవత్సరాలుగా ఇల్లు లేక, కట్టుకునే స్తోమత లేక చిన్నపాటి గుడిసెలో నివాసముంటున్నాం. జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక నివాస గృహం మంజూరు చేయడంతో మాకంటూ సొంత ఇల్లు వచ్చింది. ఇప్పుడు ఇబ్బందులు లేకుండా ఆత్మస్థైర్యంతో జీవిస్తున్నాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటాం.

### ఎన్నో ఏళ్ల కల నెరవేరింది



నా పేరు చినాకుల యోగమ్మ. రైల్వేకోడూరు మండలం రంగనాయకులపేటలో ఉంటున్నాను. ఎన్నో ఏళ్ల నుంచి ఇల్లు లేక ఇబ్బంది పడుతున్నాం. పేదలకు ఇంటి కల సాకారం చేయాలనే ప్రభుత్వ సంకల్పం చాలా గొప్పది. ప్రస్తుతం జగనన్న కాలనీల్లో గృహాలు నిర్మించుకుంటున్నాం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇంటి స్థలంతోపాటు ఇంటి నిర్మాణం చేపట్టి తమ స్వంత ఇంటి కలను నెరవేరేలా సహకరించిన సీఎం జగన్‌కు ధన్యవాదాలు.



రెడ్డివారిపల్లెలోని జగనన్న కాలనీ వ్యూ

## సస్యరక్షణ చర్యలు పాటిస్తే దిగుబడులు



రైతులకు శిక్షణ ఇస్తున్న ఉద్యానవన శాఖ అధికారిణి నాగమణి

రామాపురం : కూరగాయల సాగులో యాజమాన్య పద్ధతుల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని లక్కిరెడ్డిపల్లె ఉద్యానవన శాఖ అధికారి నాగమణి అన్నారు. సోమవారం నల్లగుట్టపల్లె గ్రామంలో కూరగాయల సాగుపై రైతులకు శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ కూరగాయల సాగులో విత్తన శుద్ధి, ఎరువుల యాజమాన్యం, సూక్ష్మ ధాతు లోపాల నివారణ, నీటి యాజమాన్యం, పంటను ఆశించే చీడ పురుగులు, తెగుళ్ల నివారణ, పూత పిందె దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆమె రైతులకు వివరించారు. టమాట పంటపై సూది పురుగు, ఈగ ఆశించడం వల్ల దిగుబడి నాణ్యమైన నారును నాటుకోవాలన్నారు. లోతు దుక్కులు చేసుకుంటే పొలంలోని ఊప దశలు ఎండిపోయి చనిపోతాయి. మొక్కలు నాటిన 20 రోజుల తరువాత ఎకరా 10 చొప్పున నీటి ఎరలు లేదా పెరమని ఎరలు లేదా దీపసు ఎరలు ఉంచితే వాటి మగ రెక్క పురుగుల ఆకర్షించబడి నీటిలో పడి చనిపోతాయన్నారు. ఎకరాకు 25 నుండి 10 చొప్పున పసుప నీలం రంగుల జిగురు అట్టలను ఏర్పాటు చేసుకుంటే రసం పీల్చే పురుగులతోపాటు సూది పురుగులు చిగురాకుకు అంటుకుంటాయని, సూది పురుగు నివారణకు మొదటిగా వేప నూనె 5 మిల్లీమిటీర్లు ఒక లీటరు నీటి కలుపుకొని పిచికారీ చేయాలన్నారు. ఉధృతి ఎక్కువగా ఉన్నట్లయితే కోరాజన్ 0.3 మి.లీ లేదా స్పైనో సైడ్ 0.3మిలీ లేదా యమామెక్టిన్ బెంజోయేట్ 0.5 గ్రాములు మందులను లీటరు నీటికి కలుపుకొని పిచికారీ చేసుకోవాలని వివరించారు. ఆకుమాడు తెగుళ్ల నివారణకు కవచ్ రెండు గ్రాములు లేదా అమిస్టార్ 1మి.లీ లేదా నాటిఓ 0.5 గ్రా లేదా ప్రొపికొనజోల్ 1మిలీని ఒక లీటర్ నీటికి కలుపుకొని 15 రోజుల వ్యవధితో రెండు సార్లు పిచికారీ చేయాలన్నారు. మిరప పంటలో తామర పురుగు ఆశించి ఆకుపై ముడతను కలిగిస్తాయి. దీని నివారణకు ఆసిపేట్ 1.5 గ్రా 2 మిలీ రీజెంట్ లేదా పెగాసిస్ 1.25 గ్రా 0.25 మి.లీను ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించారు. మిరపలో తెల్ల నల్లి ఆశించి కింద ముడత కలిగిస్తాయని దీని నివారణకు మూడు గ్రాములు నీటిలో కరిగే గంధకం లేదా మెగాసిస్ 1.25 గ్రాము లేదా ఒబెరాన్ 1మిలీ ఒక లీటరు నీటితో పిచికారీ చేయాలని రైతులకు సూచించారు.

## కొత్తపల్లెను ముంపు నుంచి కాపాడండి

రాయచోటి అర్బన్ : పట్టణంలోని కొత్తపల్లె ప్రాంతాన్ని మురుగునీటి ముంపునకు గురికాకుండా చూడాలని సీపీఎం నేతలు జిల్లా కలెక్టర్ గిరిషా పీఎస్‌కు విన్నవించారు. సోమవారం వారు స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌ను కలుసు కుని మాట్లాడుతూ పట్టణంలోని మహబూబ్‌బాషావీధి, ఎస్‌యన్‌కాలనీ, అలీమాబాద్ వీధులలోని మురుగునీరంతా మండీల వద్దనున్న ప్రధాన మురుగునీటి కాలువ ద్వారా కొత్తపల్లె వీధుల గుండా మాండవ్యనదికి చేరుతుందన్నారు. ఒక మోస్తరు వర్షం కురిసిన మురుగునీటికి వర్షపునీరంతా తోడై కొత్తపల్లె ప్రాంతంలోని వీధులలో చేరుతాయన్నారు. పెద్ద ఎత్తున ప్రవహించే వర్షపునీరు కొత్తపల్లె ప్రాంతంలోని ఇళ్లలోకి చేరుతున్నాయని, దీంతో ఇబ్బందులు పడుతున్నామని తెలియజేశారు. కాగా అధికారులు సుండుపల్లె మార్గంలో నిర్మిస్తున్న ప్రధాన మురుగునీటి కాలువలను అధికారులు మండీల వద్దనున్న ప్రధాన కాలువకు కలుపుతున్నారన్నారు. దీని వలన వర్షం కురిసినప్పుడు మురుగునీటికి వర్షపునీరు తోడై దిగువనున్న కొత్తపల్లె ప్రాంతం మరింత పెద్ద స్థాయిలో ముంపునకు గురవుతుందన్నారు. ఈ విషయాన్ని పరిగణించాలని కలెక్టర్‌ను కోరారు. లేని పక్షంలో కొత్తపల్లె ప్రాంతానికి మరింత నీటిముప్పు తప్పదన్నారు. అనంతరం ఈ మేరకు కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు డిసి వెంకటయ్య, వినయ్‌కుమార్, రామచంద్ర, కొత్తపల్లె వాసులు యూసుఫ్, నజిరుల్లా బాషా, బషీర్ తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరం

లక్కిరెడ్డిపల్లె : తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరమని లక్కిరెడ్డిపల్లె ప్రాజెక్టు సీడీపీఓ పద్మావతి పేర్కొన్నారు. తల్లిపాలు వారోత్సవాలలో భాగంగా సోమవారం స్థానిక బాలసదనం సమీపంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాపించాలన్నారు. గర్భం దాల్చిన వెంటనే అంగన్‌వాడీ కేంద్రంలో ఆయా గ్రామాల వద్ద పేరు నమోదు చేయించుకోవాలన్నారు. శిశువు పెరుగుదలను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. ప్రతినెల డాక్టర్‌ను సంప్రదించి టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రభుత్వం అందిస్తున్న జగనన్న బాలామృతం, పాలు, గుడ్లు, ఆకుకూరలు సక్రమంగా తీసుకోవాలన్నారు.

**చిన్నపిల్లలకు తల్లిపాలు తప్పనిసరి**

చిట్వేలి : తల్లిపాల వారోత్సవాలలో భాగంగా చిట్వేలి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు సీడీపీఓ రాజేశ్వరి తెలిపారు. సోమవారం నక్కలపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులకు అవగాహన కల్పించడంతోపాటు ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆగస్టు 1వ తేది నుంచి ప్రారంభమైన తల్లిపాలు వారోత్సవాలు సోమవారంతో విజయవంతంగా ముగిశాయన్నారు. చిన్న బిడ్డలకు నిర్లక్ష్యం చేయకుండా తప్పనిసరిగా తల్లిపాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ గ్రేడ్-1 సూపర్‌వైజర్ వసుందరమ్మ, గ్రేడ్-2 సూపర్‌వైజర్ సురేఖరాణి, అంగన్‌వాడీ వర్కర్ విమల, హెల్పర్ లక్ష్మి, తల్లులు పాల్గొన్నారు.

## హైవేపై ప్రమాదకరంగా కంపచెట్లు



రామాపురం: కర్నూలు – చిత్తూరు జాతీయ రహదారిలో రోడ్డుకు ఇరువైపుల పెరిగిన కంపచెట్లతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి సమయంలో విషపురుగులు సంచారం ఎక్కువైనందున ప్రమాదాలు తప్పడం లేదు. గువ్వలచెరువు, రామాపురం, గంగనేరు, కొండావాండ్లపల్లె, టోల్‌గేట్ బండపల్లె బ్రిడ్జి, దర్గా బ్రిడ్జి, రామాపురం బ్రిడ్జిపైన, కంపచెట్లు, జిల్లేడు, పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవల్సి వస్తోంది. మార్గంలోని పెట్రోల్ బంక్‌ల వద్దకు వెళ్లాలంటే కూడా ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దారిలో వెళ్లేటప్పుడు ఏమైనా ప్రమాదం జరిగిన పట్టించుకునే వారులేరని, జాతీయ రహదారి సిబ్బంది చోద్యం చూస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా టోల్ గేట్ నియంత్రణ అధికారులు పిచ్చి మొక్కలు తొలగించాలని కోరుతున్నారు.